ప్రజాశక్తి

సోమవారం 1 జనవరి 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

నూతన సంవత్సరానికి
సవాళ్లతో స్వాగతం

- సిఎం ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యోగుల సమ్మెలు
- తుపాను మిగిల్చిన విపత్తుతో రైతులకు తీవ్రంగా నష్టం
- కలగా మిగిలిన వెలుగొండ హామీ..
- 'గుండ్లకమ్మ'పై నిర్లక్ష్యం
- అన్నీ వదిలేసి ఎన్నికల సన్నాహాల్లోకి రాజకీయ పార్టీలు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

2023 ముగిసింది.. ఈ తరుణంలో కొత్త ఏడాదికి అనేక సవాళ్లు స్వాగతం పలకనున్నాయి. రాష్ట్రంలో ఏర్పాటైన వైసిపి ప్రభుత్వానికి గడువు ముగుస్తోంది. అన్నిటి కన్నా ఎన్నికలకు సన్నద్ధం కావాల్సిన ఏడాదిగా నూతన సంవత్సరం వేదిక కానుంది. రాజకీయ పార్టీలకూ కొత్త ఏడాది ఎలాంటి ఫలితం ఇస్తుందోనన్న చర్చ మొదలైంది. ఎలా ఉంటుందోనన్న మీమాంస అందరిలోనూ మెదులుతోంది. అందరి భవితవ్యానికి కొత్త ఏడాది కీలకంగా మారింది. అనేక సవాళ్లను కొత్త ఏడాదిలోనే ఎదుర్కోవాల్సి ఉంది. అన్ని రాజకీయ పార్టీలూ ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే సన్నాహాలు వాడివేడిగా సాగుతున్నాయి. కొందరు నేతల భవితవ్యం కూడా ఇప్పటికే తారుమారైంది. పాలకపక్షంలోనే చేపట్టిన మార్పుల వల్ల ప్రాతినిధ్యం వహించే స్థానాల్లోనే పోటీ చేసే అవకాశాన్ని మంత్రులే కోల్పోయారు. సిట్టింగులకు సీట్లు దక్కక వారి రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. సీనియర్ నేతల ▶ 2లో

మున్సిపల్ కార్మికులపై
పోలీసు జులుం



పోలీసుల తోపులాటతో సొమ్మసిల్లి పడిపోయిన కార్మికురాలు

- నేతలతో సహా కార్మికులూ అరెస్టు
- మహిళా కార్మికులను ఈడ్చివేసి.. బలవంతంగా పోలీసుస్టేషన్‌కు తరలింపు
- పోలీసుల తోపులాటలో సొమ్మసిల్లి పడిపోయిన మహిళలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. వారేదో నేరం చేసినట్లు వారి మీద విరుచుకుపడ్డారు. మహిళలని కూడా చూడకుండా రోడ్డు మీద ఈడ్చివేశారు. కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరించారు. మేం ఏం నేరం చేశామో చెప్పండని నిలదీసిన కార్మికులను పోలీసులు తూలనాడారు. బలవంతంగా అరెస్టు చేసి.. పోలీసుస్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే డిమాండ్లతో మున్సిపల్ కార్మికులు గత ఆరు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎపి మున్సిపల్



వాహనాలను అడ్డుకుంటున్న కార్మికులను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేస్తున్నారు. అందులో భాగంగా ఒంగోలులో కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. కార్మికుల సమ్మెను అణిచివేసేందుకు నగర పాలక సంస్థ అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పోటీ కార్మికులను రంగంలోకి దింపి పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు దగ్గరుండి నగరంలో చెత్తను పోటీ కార్మికులతో శుభ్రం చేయించేందుకు శ్రీకారం చుట్టారు. శనివారం అర్ధరాత్రి నగరంలోని పలు చోట్ల బ్లాక్ పాయింట్ల వద్ద పోగు పడిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు ▶ 2లో



ఒంగోలులో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

మోకాళ్లపై నిలబడి ఉద్యోగుల నిరసన

3లో

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే..
ఈ ప్రభుత్వం ఇంటికే..!

- ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు సిద్ధం
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి



రేపల్లెలో సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న రమాదేవి

ప్రజాశక్తి-రేపల్లె

మహిళా ఉద్యమాల వల్ల ప్రభుత్వాలు ఇంటిదోవ పట్టిన చరిత్ర ఉందని, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేయకపోతే ఈ ప్రభుత్వం కూడా ఇంటికే అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి హెచ్చరించారు. అంగన్‌వాడీల సమ్మె 20వ రోజు సందర్భంగా ఆదివారం ఆటాపాటా కార్యక్రమం నిర్వహించారు. ఆటపాటలతో రోడ్డు మీద కోలాటం, కబడ్డీ ఆటలు నిర్వహించి.. నిరసన తెలిపారు. శిబిరం వద్ద అంగన్‌వాడీలకు మద్దతు తెలిపి.. రమాదేవి మాట్లాడారు. మహిళా సాధికారిక ప్రభుత్వమంటూ.. మహిళల సమస్యల పట్ల సానుకూలంగా ఉన్నామంటూ మంత్రివర్గ ఉప సంఘం అబద్ధాలు ప్రచారం చేస్తోందన్నారు. జీతాలు ఇవ్వటానికి డబ్బులు లేవని చెప్పే ప్రభుత్వం ముఖ్యమంత్రి తన గెస్ట్‌హౌస్ కోసం రూ.450 కోట్లు ఏ విధంగా ఖర్చు పెడుతున్నారని ప్రశ్నించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల కోసం రూ.20 వేల కోట్లు కేటాయించే ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయడానికి డబ్బులు లేవా.? అని ప్రశ్నించారు. కార్మికవర్గం ఐక్యంగా ఈ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టడానికి సిద్ధమవుతున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి అంగన్వాడీ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా పేరుతో మహిళల దగ్గర పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ డ్వాక్రా మార్ట్‌లోనే సరుకులు కొనాలని షరతు పెట్టడం అన్యాయమన్నారు. మహిళల పట్ల పోలీసులను ప్రయోగించి.. అనుచితంగా ప్రవర్తిస్తూ ▶ 2లో

'ఆడుదాం ఆంధ్ర'కు స్పందన ఏదీ?

ఆడేవారు లేక, చూసేవారు లేక వెలవెలబోతున్న క్రీడా ప్రాంగణం ● వచ్చిన టీమునే గెలిచినట్లు చూపుతున్న అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం యర్రగొండపాలెంలో ఆశించిన స్థాయిలో జనం రాక, క్రీడాకారులు రాక క్రీడామైదానం బోసిపోతుంది. మొదటి రోజు ఆర్భాటంగా అధికారులు, నాయకులు కార్యక్రమాన్ని మమ అనిపించారు. ఆ తర్వాత రెండో రోజు నుంచే క్రీడాకారులు రాక వచ్చిన టీంనే గెలిచినట్లు చూపుతున్నారు. దీంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం వల్ల ఎవరికి మేలు చేకూరుతుందని విపక్షాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం పేరుతో నెల రోజులుగా ప్రభుత్వం రూ.కోట్ల ప్రజల సొమ్మును తన ప్రచారానికి వాడుకుంటుందని ఆరోపిస్తున్నారు.

కనీస స్పందన కరవు..

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ప్రేక్షకుల కోలాహలం ఉంటుందనుకున్న అధికారులు, నాయకులకు ఖాళీ మైదానాలు స్వాగతం పలుకుతున్నాయి. దీంతో ఈ కార్యక్రమం ఎందుకు ఆరంబించారో అన్న అభిప్రాయం అధికార పార్టీ నాయకులు, అధికారుల నుంచి వ్యక్తం అవుతోంది.

ప్రతి ఒక్కరి పేర్లు నమోదు

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను అట్టహాసంగా ప్రారంభించాలని భావించినా యువత నుంచి పెద్దగా స్పందన లేకపోవడం, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో సచివాలయ సిబ్బందికి లక్ష్యాలు విధించి మరీ వారిచే రిజిస్ట్రేషన్లు చేయించారు. వారి పరిధిని బట్టి ప్రతి సచివాలయంలో 200 నుంచి 250 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేయాలని లక్ష్యాలు విధించారు. అధికారుల ఒత్తిడి భరించలేక లక్ష్యాలు పూర్తి చేయాలన్న ఉద్దేశంతో తమ పరిధిలో లేని వారి పేర్లను కూడా సిబ్బంది నమోదు చేశారు.



ఖాళీగా కనిపిస్తున్న మైదానం

కానరాని క్రీడా కారిణులు..

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల పట్ల మహిళలు అంతగా ఆసక్తి కనబరచరు అన్న ఆలోచన కూడా లేకుండా ప్రభుత్వం పేర్లు నమోదు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో సచివాలయ సిబ్బంది తమ పరిధిలో ఉన్న పేర్లను నమోదు చేసి మమ అనిపించారు. కానీ వారిని మాత్రం మైదానాలకు తీసుకురాలేక పోయారు. మరోవైపు ఈ క్రీడలను వీక్షించేందుకు కూడా వందల సంఖ్యలో ప్రేక్షకులు వస్తారని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేశారు. కానీ ఒక్కరూ మైదానాలకు రాని పరిస్థితి. క్రీడాకారులనే బతిమాలి తీసుకొస్తున్న నేపథ్యంలో, ప్రేక్షకులు ఇంకెక్కడి నుంచి వస్తారని అధికారులే అభిప్రాయ పడుతుండటం గమనార్హం. మొత్తంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం కేవలం అలంకార ప్రాయంగా మారిందనే అభిప్రాయం యర్రగొండపాలెంలో సర్వత్రా వ్యక్తమవుతోంది.

మున్సిపల్ కార్మికులపై పోలీసు జులుం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నించారు. కమిషనర్ పోటీ కార్మికులను రంగంలోకి దింపి.. పోలీసుల పహారాలో పారిశుధ్య పనులు చేయిస్తూ సమ్మె చేస్తున్న కార్మికుల పట్ల కవ్వింపు చర్యలకు దిగడంతో విషయం తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు గుత్తికొండవారిపాలెం వైపు డంపింగ్ యార్డుకు వెళ్లే ట్రాక్టర్లను కొప్పోలు ఫ్లైఓవర్ వద్ద అడ్డుకున్నారు. కొత్తమామిడిపాలెం యార్డు వైపు వెళ్లే వాహనాలను కూడా అడ్డుకున్నారు. అర్ధరాత్రి ఇళ్లకు వెళ్లకుండా కార్మికులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఎముకలు కొరికే చలిలో వారి పోరాట పటిమను చాటారు. ఆదివారం ఉదయం చెత్త వాహనాలను నిలిపిఉంచే కేంద్రమైన డిఆర్ఆర్ఎం మున్సిపల్ స్కూల్ వద్ద కార్మికులు ధర్నాకు దిగారు. స్కూల్ ప్రాంగణం నుంచి చెత్త తరలింపు వాహనాలు బయటకు రాకుండా వాహనాలకు అడ్డుగా కూర్చొని నిరసన తెలిపారు. పోలీసులు బలవంతంగా వాహనాలను బయటకు తెచ్చే ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. మున్సిపల్ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఆందోళన చేస్తున్న కార్మికులను ఈడ్చివేశారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమకు ఆరు మాసాలుగా జీతాలు లేవు.. తమ బాధలు ఎవరితో చెప్పుకోవాలంటూ కోవిడ్ కార్మికులు పోలీసులను నిలదీశారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆందోళన చేస్తుంటే తమ మీద ప్రతాపం ఏంటని పోలీసులను ప్రశ్నించారు. కార్మికుల ఆవేదనను పట్టించుకోని పోలీసులు వారిని బలవంతంగా పక్కకు లాగేశారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికులకు మధ్య పెనుగులాట జరిగింది. ఈ పెనుగులాటలో ఉమా, కుమారి అనే మహిళా కార్మికులు సొమ్మసిల్లి పడిపోయారు. వారికి రక్షణగా నిలిచిన మహిళా కార్మికులను కూడా పోలీసులు పక్కకు నెట్టేశారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శి యు రత్నకుమారి, నగర నాయకులు తేళ్ల విజయ, ఎం శ్రీలక్ష్మి, బి విజయ, బి ఉమా, ఎం పద్మ, తదితరులతో పాటు మొత్తం 11మంది కార్మికులను అరెస్టు చేసి టుటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కార్మికుల అక్రమ అరెస్టును మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్ ఖండించారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికుల పట్ల మున్సిపల్ అధికారులు, పోలీసులు వ్యవహరిస్తున్న తీరును వారు తప్పుపట్టారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మున్సిపల్ కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జగన్ పాలనలో స్కీములన్నీ స్కాములే

ప్రజాశక్తి-పొదిలి

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం లోకి రాకముందు పాదయాత్రలో ఇచ్చిన హామీల అమలులో 85 శాతం ఫెయిలయ్యారని, నవరత్నాలు నవ మోసాలయ్యాయని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్రలో మొత్తం 199 హామీలు ఇచ్చారని, అమలు చేసింది కేవలం 17 మాత్రమేనన్నారు. పాదయాత్రలో సంపూర్ణ మద్యపాన నిషేధం అని చెప్పి చివరకు ఇప్పుడు ఏ ఊరిలో ఎక్కడ చూసినా బెల్టు షాపులు కనిపిస్తున్నాయన్నారు. ఇక ఇసుక స్కామ్‌లో ధరలు పెంచి పేదల పొట్టకొట్టారని, ఎక్కడ చూసినా వైసీపీ నాయకులు వేల కోట్లు గడించారని, సిమెంట్ ధరలు ఇప్పుడు చుక్కలంటాయని, భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని తెలిపారు. ఇలా వైసీపీ ప్రభుత్వంలో స్కాములు లేని స్కీము లేదని వైసిపి పాలనంతా స్కాములమయమని ఉద్ఘాటించారు. వెలుగొండ ప్రాజెక్టును అధికారంలోకి వచ్చిన ఏడాదిలో పూర్తి చేస్తానని పాదయాత్రలో హామీ ఇచ్చినా నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలలు గడచినా ఇప్పటికి వెలుగొండ పూర్తి చేయలేదన్నారు. కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల టిడిపి నాయకులు కాటూరి వెంకట నారాయణబాబు, నారాయణ ప్రతాప్ మీగడ ఓబుల్ రెడ్డి, ముల్లా ఖుర్దూస్, యర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, తాతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, యాసిన్, సయ్యద్ ఇమాం సాహెబ్, నేరెళ్ల శ్రీనివాసులు, టెంట్ హౌస్ నరసింహారావు పాల్గొన్నారు.

వైద్యశాలలో తనిఖీ

ప్రజాశక్తి-మద్దిపాడు: జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ డైరెక్టర్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ పి సరళమ్మ తెలిపారు. మద్దిపాడు పిహెచ్‌సిని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన కిట్లను ఆమె పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ నెల 2న మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ మూర్తి, డిఎంహెచ్ఒ డాక్టర్ రాజ్యలక్ష్మి, స్థానిక వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఒంగోలులో ఆట పాటలతో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఈ ప్రభుత్వం ఇంటికే.!

(మొదటిపేజీ తరువాయి)

అడ్డుకుంటున్నారని, నిర్బంధాలను ప్రయోగిస్తున్నారని, మొండిగా వ్యవహరిస్తే ఈ ప్రభుత్వాన్ని మూడు నెలల్లో ఇంటిదోవ పట్టించడానికి అంగన్‌వాడీలు సిద్ధమవుతున్నారని చెప్పారు. ఐక్య ఉద్యమాల ద్వారా ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు. సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ, ప్రాజెక్ట్ కార్యదర్శి కె.వాణి నాయకులు నిర్మలజ్యోతి, కష్ణకుమారి, రజిని, దివ్య, ప్రజాసంఘాల నాయకులు పి.మనోజ్, కె.వి లక్ష్మణరావు, కె.రమేష్, వి.మావో, కె ఆశీర్వాదం, డి.శ్రీనివాసరావు, జె.ధర్మరాజు, వై.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో ఆటపాటలతో నిరసన

ఒంగోలు కలెక్టరేట్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 20వ రోజుకి చేరుకుంది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు ఆటపాటలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని అంగన్‌వాడీ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అధికారులు మంత్రులు జోక్యం చేసుకొని వారికి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి కల్పన, కెవి సుబ్బమ్మ, పి ప్రశాంతి, హేమీమా, సిహెచ్ జ్యోతి, సిహెచ్ రాజేశ్వరి, సంధ్యారాణి, పద్మ, శేషమ్మ, గౌసియా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సవాళ్లతో స్వాగతం

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితే గందరగోళంగా మారింది. జరుగుతున్న పరిణామాలపై ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. పార్టీ యువనేత లోకేష్ పాదయాత్ర జిల్లాలో పార్టీలో ఉత్సాహాన్ని పెంచింది. అదే ఊపుతో ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. వామపక్షాలు ప్రజాసమస్యలపై పోరాటాలు సాగించాయి. భవిష్యత్‌లోనూ ఇదే ఎజెండాతో ముందుకు సాగనున్నాయి. ఎన్నికల్లో ప్రాతినిధ్యం కోసం కూడా అడుగులు వేస్తున్నాయి. ఇక ఇతర అంశాల్లోకి వెళితే కొత్త ఏడాదిలోనూ అనేక సవాళ్లు వీడేలా లేవు. సిఎం జగన్ ఐదేళ్ల క్రితం ఇచ్చిన హామీ అమలు కోసం పెద్దఎత్తున ఉద్యమాలు మొదలయ్యాయి. ఐదేళ్లు ఓపిక పట్టిన అంగన్‌వాడీలు, మున్సిపల్ ఉద్యోగులు, సర్వశిక్ష ఉద్యోగులు సమ్మెలో ఉన్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 20 రోజులైనా ప్రభుత్వం స్పందించలేదు. అందరూ సిఎం జగన్ ఇచ్చిన వేతనాల పెంపు, కాంట్రాక్టు ఉద్యోగుల పర్మినెంట్ తదితర డిమాండ్లతోనే సమ్మెలో ఉన్నారు. సమ్మెను పరిష్కరించాలనే ఆలోచనలో రాష్ట్రప్రభుత్వం కనిపించడం లేదు. మంత్రుల ఇళ్లు ముట్టడి వంటి కార్యక్రమాలతో సమ్మెలు ఉధృతంగా సాగుతున్నాయి. ఇవి కొత్త ఏడాదిలోనూ కొనసాగుతాయి. ఎందుకంటే వాటికి ఇప్పటికీ పరిష్కారం చూపలేదు. సమ్మె విరమించే చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. జిల్లాలో అత్యంత కీలకమైన వెలుగొండ ప్రాజెక్టును అక్టోబరులో ప్రారంభిస్తామని సిఎం జగన్ జిల్లాలోనే హామీ ఇచ్చారు. దీన్ని పూర్తిగా మరిచారు. ఐదేళ్లలో దీన్ని పూర్తి చేయడానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. చివరి దశలో ఉన్న సొరంగం ఒకటి పూర్తయింది. రెండోది జరుగుతోంది. పునరావాసం పూర్తికాలేదు. నిర్వాసితులకు ప్యాకేజీలు అవిగోఇవిగో అంటూ కాలం గడిపారు. పశ్చిమాన వైసిపికి బలం ఉందనే భావనతో దీన్ని వదిలేశారు. సిఎం జగన్ జిల్లాకు ఇచ్చిన హామీల్లో కీలకంగా ఉన్నా నేతలకూ పట్టలేదు. రాజకీయ పెత్తనం, పదవుల కోసం పేచీలు పడి నేతలు ఎవరిదారిన వాళ్లు నడిచారు. దీంతో వెలుగొండ హామీ అమలు కాలేదు. రేపు ఎన్నికల్లో జనానికి ఏం సమాధానం చెబుతారో చూడాలి. గెలుపుపై నమ్మకం లేకనే పశ్చిమాన ఉన్న మంత్రిని కూడా కొండపికి మార్చారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుపైనా తీవ్ర నిర్లక్ష్యం. ఏడాది క్రితం కొట్టుకుపోయిన గేటును ఇప్పటికీ మరమ్మతు చేయలేదు. ఇటీవల మరో గేటు కొట్టుకుపోయింది. నీరంతా వృథాగా పోయింది. రైతులకు కరువులో పంటలకు అందేనీరు సముద్రం పాలైంది. ఇప్పుడు రిజర్వాయర్ నిండుకుంది. దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. ఇప్పటికీ దాని మరమ్మతులపై దృష్టి సారించలేదు. కొత్త ఏడాదిలోనూ గుండ్లకమ్మ సమస్యగానే మిగులుతోంది. ఉపాధి రంగాల్లోనూ నిస్తేజం కనిపిస్తోంది. గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో పడింది. నిర్మాణరంగం కూడా ఇదే పరిస్థితి. రియల్‌ఎస్టేట్ రంగం నిస్తేజంగా ఉంది. కొత్తగా పరిశ్రమలు లేవు. దొనకొండ, కనిగిరి సెజ్‌లు ఎండమావులుగా మారాయి. చదువుకున్న యువతకు ఉపాధి కరువైంది. జిల్లా సమగ్రాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు అంటూ ఏమీ కనిపించలేదు. సంక్షేమ ఎజెండా తప్ప గుంటలు పడ్డ రోడ్లకు తట్టమట్టి కూడా పోయలేని స్థితి కొనసాగుతోంది. ఇక ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. సుమారు 60 వేల ఎకరాల్లో పంటలు పోగా కేవలం 5 వేల ఎకరాల్లోనే వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు ఎన్యూమరేషన్‌లో తేల్చారు. రైతులకు పెట్టుబడుల రూపంలోనే కోట్లాది రూపాయలు నష్టం జరిగింది. ఉత్పత్తుల రూపేణా భారీమూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వ సాయం ఇప్పటికీ లేదు. వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం రూ.2.82 కోట్లే పరిహారం రానుంది. నష్టం ఎంత? ఇచ్చేదెంత? అనేదీ చూడాలి. అన్ని రంగాల్లోనూ నిస్తేజమే కనిపిస్తోంది. వ్యాపారవర్గాలు పెదవి విరుస్తున్నాయి. ఈ తరుణంలో కొత్తఏడాదిలో అందరికీ మంచి జరగాలనే ఆశయంతోనే అడుగుపెడదాం. కొత్త సవాళ్లను అధిగమించాలి. అందుకు అందరూ సన్నద్ధం కావాల్సిన సమయమిది.

ప్రజాశక్తి
3
సోమవారం 1 జనవరి 2024



అర్జీ ఇస్తున్న రైతులు

జొన్న పంట పరిశీలన


ప్రజాశక్తి-బేస్తవారిపేట

రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఐ తిరుపతిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం మండలంలోని పూసలపాడు గ్రామంలో కంది, జొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల సమస్యలు తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల కంది జొన్న పంటలు నష్టపోయామని వాపోయారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగుచేసిన పంటలు బెట్టకు గురయ్యాయన్నారు. దీంతో తమ పెట్టిన పెట్టుబడులు కూడా వెళ్లక తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వివరించారు. ప్రభుత్వం ఈ పరిస్థితులు దష్టిలో పెట్టుకొని కరువు మండలంగా ప్రకటించాలని రైతుల విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల వ్యవసాయ సలహా మండల చైర్మన్ ఆవుల కోటిరెడ్డి బేస్తవారిపేట మండలానిన్ని కరువు మండలం ప్రకటించాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారు తిరుపతి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిద్దలూరు ఏడిఏ డి.బాలాజీ నాయక్, మండల వ్యవ సాయ అధికారిని జక్కం మెర్సి, సాంకేతిక వ్యవసాయ అధికారి షేక్ మహబూబ్ బాషా, రాచర్ల వ్యవసాయ అధికారి ఎస్కే రఫిక్ పాల్గొన్నారు.

దళిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి నగర పంచాయతీ పరిధిలోని బుచ్చెనపాలెం ఎస్సీ కాలనీలో ఇటీవల అకాల మరణం చెందిన మల్లెల రోశయ్య పెద్ద కుమారుడు దావీదు భార్య మార్తమ్మ కుటుంబాన్ని అదే గ్రామానికి చెందినరెడ్డి జేఏసీ డాక్టర్స్ విభాగం సహాయ కార్యదర్శి, జిల్లా వైసీపీ యువ నాయకులు, పేదల డాక్టర్ యర్రం వెంకటరెడ్డి పరామర్శించారు. వారి కుటుంబ స్థితిగతులు అడిగి తన వంతుగా పది వేలు రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తన వంతుగా ఆదుకుంటానని చెప్పారు.



వైసిపిలోకి ఆహ్వానిస్తున్న ఉడుముల

9 కుటుంబాలు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-పొదిలి

కొనకనమిట్ల మండలం నాయుడుపేట, గొట్లగట్టు గ్రామాలలో టిడిపికి చెందిన తొమ్మిది కుటుంబాల వారు ఆదివారం వైసిపిలో చేరారు. స్థానిక కంభం మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసరెడ్డి నివాసంలో వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు జగనన్న పథకాలు బాగున్నాయని, ప్రజలకి మంచి జరుగుతుందనే ఈ పార్టీలో చేరామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన కోనేటి రెడ్డీ రాజేష్, అనిల్, గొట్లగట్టు ఎస్‌సి నాయకులు డేవిడ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పుటుకూరి రామయ్య, పి థామస్, జేమ్స్, డి డేవిడ్, కాకి రాఘవరావు, తాళ్లూరి ఐఫేక్, కొదమ దేవయ్య, కోలా రత్తయ్య, కోలా సామ్సన్‌లు పార్టీ కండువా వేసుకున్నారు.

మోకాళ్లపై నిలబడి ఉద్యోగుల నిరసన

12వ రోజుకి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సమగ్ర శిక్షలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష ప్రకాశం జిల్లా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ జెఎసి ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె 12వ రోజుకి చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. సమ్మెకు అధ్యక్షత వహించిన డిపిఒ కార్యాలయ జెఏసి నాయకులు మహేష్ మాట్లాడుతూ శనివారం జరిగిన చర్చల్లో హెచ్‌ఆర్ పాలసీ విధివిధానాలను తెలుసుకోమని అధికారులకు, విద్యా శాఖ మంత్రి సూచించారని, అవసరమైతే తాను రెడీ చేసి హెచ్‌ఆర్ ఫైల్ సిద్ధం చేసి ఇస్తామన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో ఉన్న అన్ని విభాగాల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ స్టేట్ కౌన్సిలర్ పోతులూరయ్య, ఏపిటిఎఫ్ తాళ్లూరు మండల శాఖ నాయకులు సుబ్బారెడ్డి మద్దతు తెలియజేశారు. సమగ్ర శిక్షలో ఉన్న అన్ని విభాగాల ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు, చైల్డ్ కేర్ లీవ్‌లు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగి మధు తన ఆటపాటలతో సమ్మెలో పాల్గొన్న వారిని ఉత్సాహపరిచారు. ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులైన నాగేంద్ర వదన్ రూ.5 వేలు ఆర్థిక సహకారం అందించారు. జెఏసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.హరిబాబు, యు.కళ్యాణి మాట్లాడుతూ రాష్ట్ర జెఏసితో జరిగిన చర్చలు విఫలం కావటంతో అన్ని జిల్లాల్లో ఈ సమ్మెను మరింత ఉధృత చేస్తామని, తమ డిమాండ్లు సాధించుకునేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెఏసి నాయకులు మధు, నరసింహం, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించి..

సమ్మెలను విరమింపజేయాలి

సిపిఎం రాష్ట్ర నాయకులు వై.సిద్ధయ్య

ప్రజాశక్తి-పామూరు

అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించి.. సమ్మెలను ప్రభుత్వం విరమింపజేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు వై.సిద్ధయ్య డిమాండ్ చేశారు. పామూరులో ఆదివారం జరిగిన సిపిఎం కార్యకర్తల రెండోరోజు శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. పాలకులు ప్రజలతో ఎన్నుకోబడి.. గెలిచిన తర్వాత వారి సమస్యలు మర్చిపోతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిందని దీనికి పాలకుల బాధ్యులన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను మరిచి ధనవంతులకు కొమ్ము కాస్తున్నాయన్నారు. ఆంధ్రాలో రాజధాని లేకుండా చేశారని



మాట్లాడుతున్న వై.సిద్ధయ్య

అన్నారు. వ్యవసాయం అభివద్ధి చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం నీరుగార్చి ప్రజలకు ఉపాధి లేకుండా చేశారని అన్నారు. మహిళలపై దాడులు పెరిగాయని తెలిపారు. రాష్ట్రంలో ఉపాధి లేక యువకులు వలస పోతున్నారన్నారు. రాబోయే రోజుల్లో దుర్మార్గ పాలనను వ్యతిరేకించి.. బిజెపికి వ్యతిరేకంగా సిపిఎం కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సిఎస్‌పురం మండల నాయకులు తిరుపతిరెడ్డి అధ్యక్షత వహించారు.

ఒంగోలులో 'ప్రకాశం' బాలోత్సవం

- ఫిబ్రవరి 9, 10 తేదీలలో కార్యక్రమ నిర్వహణ
- ఆహ్వాన సంఘ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న ఆహ్వాన సంఘం కమిటీ నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం బాలోత్సవం ఒంగోలులో ఫిబ్రవరి 9, 10 తేదీలలో జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. స్థానిక ఎన్జీవో హోంలో బాలోత్సవం నిర్వహణ కొరకు ఆహ్వాన సంఘం సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిథిగా అమరావతి బాలోత్సవ కార్యదర్శి యువి రామరాజు మాట్లాడుతూ పిల్లలలో సజనాత్మకతను ప్రశ్నించే తత్వాన్ని, సమాన భావనలను పెంపొందించడానికి ఈ బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 15 ప్రాంతాలలో బాలోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ బాలోత్సవాలకు పిల్లలు, పెద్దలలో అనూహ్యమైన స్పందన ఉందన్నారు. ఒంగోలు బాలోత్సవాలు అదే స్ఫూర్తితో నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పాటిబండ్ల ఆనందరావు, అధ్యక్షులుగా పి.ప్రకాష్‌బాబు, ప్రధాన కార్యదర్శి కె. సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మోజి శ్రీనివాస్‌రావు, జాయింట్ సెక్రటరీ బాలకోటయ్య, కోశాధికారి ఎస్.రవి, గౌరవ సలహాదారులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులతో 45 మందితో ఆహ్వాన సంఘ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘ గౌరవాధ్యక్షులు ఆనందరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో కలలను ప్రోత్సహించడం ద్వారానే మంచి అభివద్ధి చెందుతారని, వారిలో సూక్ష్మ పరిశీలనా శక్తి పెంపొందించాలన్నారు. అధ్యక్షులు పి.ప్రకాష్ బాబు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో విద్యార్థులకు పది పాయింట్లు రావాలంటే ఇలాంటి బాలోత్సవాలలో పాల్గొనాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఈ రూపంలో కేరళ ప్రభుత్వం కళలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ పోటీలలో అకాడమిక్, కల్చరల్ వంటి మొత్తం 22 అంశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులను సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ మూడు విభాగాలుగా విభజిస్తామనానరు. పాఠశాలలకు ఎంట్రీ ఫారమ్స్ పంపి వాటి ద్వారా వచ్చిన వారిని పోటీలలో పాల్గొనటానికి అవకాశం కల్పిస్తామన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మోజి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సంస్థలు, సంఘాలను కలుపుకొని విస్తత స్థాయిలో బాలోత్సవ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. బాలోత్సవాలకు జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారన్నారు. గౌరవ సలహాదారులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు మాట్లాడుతూ రచయితల సంఘము నుండి సంపూర్ణ సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ఎస్ రవి ,దామా శ్రీనివాసరావు ,వై కొండల్, జి శేషయ్య ,యు భాస్కర్, బి తిరుపతయ్య, డిఎల్ ప్రసాద్, సిహెచ్ జయప్రకాష్, వినోద్, బాబు, వి వెంకటేశ్వర్‌రెడ్డి, నాగేశ్వరరావు, మస్తాన్‌రావు, వై.వెంకట్రావు, డి వీరాంజనేయులు, ఓ.వీరారెడ్డి, పేరయ్య పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలిపై అత్యాచారం జరిగిన సంగతి తెలిసిందే. అత్యాచార నిందితుడు దేవండ్ల కమల్‌నాథ్‌ను మార్కాపురం డిఎస్‌పి జి.వీరరాఘవరెడ్డి సారథ్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి రాయవరం గ్రామంలో సిఐ ఆవుల వెంకటేశ్వర్లు ఆదివారం మధ్యాహ్నం అరెస్ట్ చేసినట్లు మార్కాపురం రూరల్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వరనాయక్ తెలిపారు.

గొర్రెలు, మేకల అపహరణ

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

తడికల దొడ్డిలో తోలి ఉన్న గొర్రెలు, పొట్టేళ్లు, మేకలను గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయిన సంఘటన మండలంలోని బొడావులదిన్నె గ్రామానికి సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. బోడావులదిన్నె గ్రామానికి చెందిన గొర్రెల పోషకులు తమ గొర్రెలను గ్రామానికి సమీపంలోని చేలలో తడికల దొడ్డి కట్టి ప్రతిరోజూ రాత్రి అక్కడకు తోలుతుంటారు. ఎప్పటిలాగే శనివారం రాత్రి గొర్రెలను తడికల దొడ్డిలో తోలి ఇంటికి వెళ్లి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో గొర్రెలు అరుస్తూ గ్రామంలోకి వచ్చాయి. దీంతో గొర్రెల పోషకులు గొర్రెల దొడ్డి వద్దకు వెళ్లి పరిశీలించగా లాకా పెద్ద కొండయ్యకు చెందిన మూడు మేకలు, లాకా కొండలరావుకు చెందిన ఒక పొట్టేలు, ఒక గొర్రె, యన్నం కొండలరావుకు చెందిన ఒక పొట్టేలు, ఒక పోతు, రెండు గొర్రెలు కనిపించలేదు. దీంతో తమ జీవాలను దొంగలు అపహరించుకుపోయినట్లు వారు గుర్తించారు. ఈ విషయం ఎస్ఐ అనిల్ కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు గొర్రెల పోషకులు తెలిపారు.



తెలంగాణ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-పొదిలి

స్థానిక దర్శి రోడ్డులో ఎస్వీకేపి డిగ్రీ కళాశాల సమీపంలో హైదరాబాద్ నుండి పొదిలి వైపుకు వస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్‌లో అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన 16 మద్యం బాటిళ్లను పొదిలి సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వరుసగా రెండవ రోజు శనివారం సమాచారం అందుకున్న అధికారులు అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతూ పొదిలి స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్టీసీ మరియు ప్రయివేట్ ట్రావెల్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో ఒక ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులో తరలిస్తున్న మద్యాన్ని గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని నలుగురుని అదుపులోకి తీసుకున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని పెద్ద మంతనాల, పనుకుమడుగు, తిమ్మాపురం గ్రామ పరిసరాల్లో ఆదివారం ఎస్ఈబీ, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన రెండు వేల లీటర్ల బెల్లం ఊటను గుర్తించి పారబోశారు. నాటుసారా బట్టీలను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ మార్కాపురం సిఐ రాగమయి, ఎస్సై పద్మజ, మార్కాపురం ఎస్సైలు వెంకటేశ్వరరావు నాయక్, కోటేశ్వరరావు, దోర్నాల ఎస్సై అంకమరావుతో పాటు ఎస్ఈబీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలం ఓబులాపురం తండా అటవీ ప్రాంతంలో నాటు సారా చేసేందుకు సిద్ధంగా ఉన్న 300 లీటర్ల ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. నాటు సారా తయారు చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న గిద్దలూరు సెబ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అరుణకుమారి, సబ్ ఇన్స్పెక్టర్ మహేష్‌లు వారి సిబ్బందితో నాటుసారా తయారీ ప్రదేశం వద్దకు వెళ్లారు. నాటు సారాను ధ్వంసం చేశారు.

ఆటపాటలతో అంగన్‌వాడీల నిరసన



బాపట్లలో పాటలతో అంగన్‌వాడీల నిరసన



భట్టిప్రోలులో కబడ్డీ ఆడుతూ అంగన్‌వాడీల నిరసన



మార్టూరులో టగ్‌ఆఫ్‌వార్ తాడు లాగుతూ నిరసన

ప్రజాశక్తి - బాపట్ల

అంగన్‌వాడీల సమ్మె 20వ రోజుకు చేరింది. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో భాగంగా అంత్యా క్షరి పాటలు ద్వారా తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు సమ్మె వీడేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. పండగలను సైతం వదిలేసి ప్రభుత్వం దిగి వచ్చే వరకు సమ్మె, ఆందోళన వీడేది లేదని బాపట్ల ప్రాజెక్ట్ అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు శైలశ్రీ చెప్పారు. సమ్మెకు సిఐటియు నాయకులు శరత్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీతా, హేమమాలిని, గీత పాల్గొన్నారు.

కారంచేడు : సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న ఆందోళన ఆదివారంకు 20వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద సిఐటియు అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగించారు. న్యాయమైన కోరికలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు పి కొండయ్య పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : జీతాలు పెంచుతావా.. పెంచవా జగనన్నా అంటూ అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తాడు లాగి వినూత్నంగా నిరసన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 20రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ జగన్ సర్కార్ నుండి ఎటువంటి స్పందన లేకపోవడం దారుణమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు అన్నారు. జగన్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడానికి సిద్దంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి యూనియన్ నాయకులు తాళ్ళూరి రాణి, శ్యామలాదేవి, శాంతి, రాజేశ్వరి, నిర్మల కుమారి పాల్గొన్నారు.

చీరాల : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమ్మె 20రోజులుగా కొనసాగుతుంది. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ఆట, పాటల ద్వారా నిరసన తెలిపారు. సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు కనీసం వినతి పత్రం కూడా ఇవ్వడానికి వీలు లేకుండా నియంతృత్వంగా వ్యవహరిస్తుందని అన్నారు. వేతనాల పెంపులో తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీల పోరాటాన్ని పరిష్కరించకపోతే మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంగన్‌వాడీల పోరాటానికి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరమ్మ, ఝాన్సీ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాలు అనిత, ఇంద్రాణి, అనుమాయమ్మ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె 20వ రోజుకు చేరింది. దీక్ష శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలు పెంచాలంటూ కూత పెడుతూ కబాడీ, కుర్చీల ఆట ఆడి ఆదివారం నిరసన వ్యక్తం చేసారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు దీక్షలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రమాదేవి, సూర్యలక్ష్మి, గృహలక్ష్మి పాల్గొన్నారు.

కొల్లూరు : అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సమ్మె 20వ రోజు ఆదివారం కూడా కొనసాగించారు. తమ న్యాయమైన హక్కుల సాధన కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా దీక్షా శిబిరం పక్కనున్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు బి అగస్టిన్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి మోసం చేస్తున్నాడని అన్నారు. సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు, సెక్టర్ లీటర్లు పాల్గొన్నారు.



కారంచేడు తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా



చీరాలలో అంగన్‌వాడీల నిరసన



కొల్లూరులో డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి అంగన్‌వాడీల వినతి




సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతుగా ఉపాధ్యాయులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - బాపట్ల

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె ఆదివారం కూడా కొనసాగించారు. 12రోజులుగా జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రజా సంఘాల నాయకులు సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమ్మెకు జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షులు టి మాణిక్యరావు నాయకత్వం వహించారు.



ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ఏలూరి

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రజాశక్తి 2024నూతన క్యాలెండర్‌ను ఇసుకదర్శిలోని ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదానికి అక్షర రూపం ప్రజాశక్తి పత్రికని అన్నారు. నిర్భయంగా, నిష్పక్షపాతంగా ప్రజలకు వార్తలు అందిస్తున్నపత్రికని ప్రశంసించారు. భవిష్యత్తులో ఇదే ఒరవడిని కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి విలేఖరి కుడారి రాజకుమార్, స్థానిక టిడిపి నాయకులు, ఉపాధ్యాయ సంఘ నేతలు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కమిటి సభ్యులు ఆర్య

ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

భగత్ సింగ్ ఆశయాల కోసం పోరాడుతామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పట్టణంలోని వివిధ కళాశాలల ముందు ఆదివారం ఎస్ఎఫ్ఐ జెండాలు ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ 1970 డిసెంబర్ 30, 31తేదీల్లో కేరళలో అధ్యయనం, పోరాటం నినాదంతో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో తొలి మహాసభ నిర్వహించారని అన్నారు. గత 53ఏళ్లుగా దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు చేసిందని అన్నారు. ఎంతోమంది విద్యార్థులు తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారని అన్నారు. వారందరి ఆశయాల కోసం పని చేస్తామని అన్నారు. ప్రస్తుతం దేశంలో ఎస్ఎఫ్ఐ పోరాటాలు మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి విద్యార్థులతో పాటు ప్రజలందరూ సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ నూతన విద్యా విధానం 2020ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. విద్యా వ్యవస్థలో మూఢత్వాన్ని పెంచి పోషించేందుకు తీసుకువచ్చిన ఈ విధానం పేద విద్యార్థులకు శాపంగా మారిందని అన్నారు. నూతన విద్యా విధానం రద్దు కోసం జనవరి 12న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్ఎఫ్ఐ 53ఏళ్ల త్యాగాలను స్మరించుకుంటూ భవిష్యత్తులో జిల్లాలో మరింతగా విద్యార్థుల సమస్యలపై పోరాడుతామని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, పిజి సెంటర్ ఏర్పాటుకై ఉద్యమాలు చేస్తామన్నారు. జీవో నెంబర్ 77రద్దు అయ్యే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భాను తేజ, సాదిక్, వెంకటేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సీఐటీయు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. 6వ రోజు సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్ బాబురావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల నిరంకుశంగా వ్యవహరిచడం దారుణం అన్నారు. కరోనా విపత్కర పరిస్థితిలో ప్రజలు, అధికారులు ప్రాణభయంతో ఇళ్లకు పరిమితమైన సందర్భంలో కూడా మున్సిపల్ కార్మికులు ప్రాణాలకు తెగించి వీధులను శుభ్రం చేసి కరోనాను ఎదుర్కోవడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆనాడు మున్సిపల్ కార్మికుల శ్రమను గుర్తించి కరోనా వారియర్స్ అని అవార్డులు ఇచ్చి కాళ్లు కడిగి సన్మానం చేసిన ప్రభుత్వమే ఈరోజు ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని అన్నారు. కార్మికులు రోడ్డు ఎక్కితే నిర్బంధ చర్యలు పూనుకోవడం దుర్మార్గమని అన్నారు. పోటీ కార్మికులను తీసుకురావడం, సమ్మెను విచ్ఛిన్నం చేసే కుట్రలు చేయడం హేయమైన చర్యని అన్నారు. కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా కార్మికులపై బెదిరింపులు చేయడం సరైన చర్య కాదని అన్నారు. సమాన పనికి సమాన వేతనం, పర్మినెంట్, సంక్షేమ పథకాల అమలు తదితర డిమాండ్లు పరిష్కారం చేయాలని కోరారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దిగి వచ్చే వరకు సమ్మె, పోరాటం కొనసా గుతుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు నూతలపాటి రాజు, కార్యదర్శి ఎండ్లూరు సింగయ్య, కోశాధికారి మానికల శంకర్, బడుగు కుమారి, గూడూరు కోటేశ్వరమ్మ, వై సంధ్యా, బి విజయమ్మ, సిరీషా, తిరుపతమ్మ, యశోద, సుబ్బమ్మ, ఆంజనేయులు, రేణుమాల నసాగరాజు, గూడూరు శిరీష, పద్మ పాల్గొన్నారు.

అద్దంకి : మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె ఆరో రోజూ నిర్వహించారు. నిరసన శిభిరం వద్దనే వంటావార్పుతో పాటు మోకాళ్లపై నిలుచుని నిరసన తెలిపారు. జగన్ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలపుకోవాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కార్మికుల పట్ల వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ బానిసలుగా పని చేయించుకుంటున్నారని అన్నారు. నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించిన పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో పి ఆదామ్, భీష్మ పాల్గొన్నారు.



వంటికాలిపై మున్సిపల్ కార్మికులు నిరసన



ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరిస్తున్న పి మనోజ్‌కుమార్

హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ పోరాటం

ప్రజాశక్తి - రేపల్లె

ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయం నందు ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కెవి లక్ష్మణరావు ఆదివారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి మనోజ్ కుమార్ మాట్లాడుతూ 1970లో అధ్యయనం పోరాటం నినాదంతో దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యల పరిష్కరం కోసం ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందని అన్నారు. నాటి నుండి నేటి వరకు శాస్త్రీయ విద్యా విధానం కోసం, విద్యార్థుల హక్కుల కోసం, విద్యారంగంలో వస్తున్న పెడధోరణలు, విద్యార్థుల సమస్యల పైన ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని అన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో చేస్తున్న మార్పుల వలన ఆశాస్త్రీయమైన భావాలతో కూడిన విద్యా విధానం అమలు చేస్తున్నారని అన్నారు. దానివలన విద్యార్థుల ఆలోచనలను కలుషితం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో పాఠశాలల విలీనం పేరుతో విద్యావ్యవస్థను ధ్వసం చేశారని అన్నారు. పేదలకు పాఠశాలను దూరం చేశారని ఆరోపించారు. ఆంగ్ల మాధ్యమంతో సమానంగా తెలుగు మాధ్యంలోనూ విద్యాబోధన చేయాలని కోరారు. వీటికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సూర్య ప్రకాష్, ఎస్ఎఫ్ఐ నాయకులు హేమ, నాగశ్రీ, భవాని పాల్గొన్నారు.

ఆటలతో నిరసన

20వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి -యర్రగొండపాలెం

సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు కుర్చీలాట ఆడి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా అంగన్ వాడీలు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి తమ సమస్య లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు మల్లేశ్వరి, సుభాషిణి, నాగ మల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బులు, సిహెచ్ సునీత, అరుణ, కె.జయమ్మ, నాగరాజకుమారి, సుబ్బులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు వివిధ రకాల ఆటలు ఆడి నిరసన తెలిపారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆంజనేయులు, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, జయప్రద, రాధ, రజనీకుమారి, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొ న్నారు.


కొండపిలో ఆటలు ఆడుతున్న అంగన్‌వాడీలు

కంభం : అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి. కొండారెడ్డి డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు దీక్ష నిర్వహించారు. దీక్షలో కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి.కొండారెడ్డి, రైతు సంఘం నాయకుడు వి. రామకష్ణ మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్‌తో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిం చాలన్నారు. లేకుంటే అంగన్‌వాడీలు సమ్మె మరింత ఉధతం చేస్తారని తెలిపారు. సిఐటియు మండల సిఐటియు కన్వీనర్ షేక్ అన్వర్ బాషా, నాయకులు దానం, వెంకట్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కొండపి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు ఆటలు ఆడి నిరసన తెలిపారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు పున్నమ్మ, సిఐటియు నాయకులు జి.వందనం పాల్గొన్నారు.

దర్శి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు రిలేనిరాహార దీక్షలు నిర్వహించారు.అ నంతరం కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. ఆటపాటలతో అందరినీ అలరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు బోడపాటి హనుమంతరావు మాట్లాడుతూ పండగలు ,ఆదివారాలు అని లేకుండా అంగన్‌వాడీలు మొక్కవోని దీక్షలో పోరాడుతున్నా ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.తిరుపతమ్మ, అచ్చమాంబ, బాలమ్మ, వెంకట రమణ, సుజాత, రంగమ్మ, పద్మావతి, ప్రభావతి, సందు వెంకటేశ్వరరావు, ఉప్పు నారాయణ తదితరులు పాల్గొన్నారు.


యర్రగొండపాలెంలో కుర్చీలాట ఆడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


కంభంలో మాట్లాడుతున్న జివి. కొండారెడ్డి

కనిగిరి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు కుర్చీలాట ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిసి. కేశవరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. హామీలు అమలు చేయని వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులుసుజాత, సీత, రజిని, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, సౌందర్య, రామ సుబ్బులు, డివైఎఫ్ఐ నాయకుడు నరేంద్ర, ఐద్వా నాయకులు బషీరా, శాంతకుమారి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్ : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెలకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి.కొండారెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీలు పాల్గొ న్నారు.


కనిగిరిలో ఆటలు ఆడుతున్న అంగన్‌వాడీలు


దర్శిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


గిద్దలూరులో క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

ప్రజాశక్తి 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బి. పూర్ణచంద్రరావు, డివి. నరసింహ మూర్తి, శేషగిరి, సాయినాథ్, ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు


త్రిపురాంతకంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జానుబాబు

తిపురాంతకంలో : ప్రజాశక్తి 2024 క్యాలెండర్‌ను ఎవిఎం ట్రస్టు అధినేత, వైసిపి నాయకుడు జినుకుటి జానుబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి విలేకరి గొట్టెముక్కల రాజారామయ్య, సొసైటీ ప్రెసిడెంట్ దగ్గుల వేణుగోపాల్‌రెడ్డి, రామసముద్రం సర్పంచి కోట పిచ్చయ్య, సుబ్బారెడ్డి, ఎనిబారా పిచ్చయ్య, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

దర్శి లో : ప్రజాశక్తి 2024 క్యాలెండర్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరు ఎంపిపి పోశం మధు సూదన్‌రెడ్డి, కోటా రామిరెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, దగ్గుల రామకృష్ణ, దగ్గుల మంగిరెడ్డి, దర్శి, ముండ్ల మూరు విలేకర్లు రామకోటిరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


లాడ్జిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే జనార్ధన్ దంపతులు

అరుణ్ లాడ్జి ప్రారంభం

ఒంగోలు నగరంలోని 60 అడుగుల రోడ్డులో అరుణ్ లాడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొన్న ఒంగోలు మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్‌రావు.

- ప్రజాశక్తి, ఒంగోలు



యానాదుల సమస్యలు తెలుసుకుంటున్న దేవరకొండ రాము

యానాదులకు అందని పథకాలు

ప్రజాశక్తి - బాపట్ల

గిరిజన యానాదులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోక తరతరాలుగా పొలం గట్లు, చెట్లనీడనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని ఉమ్మడి గుంటూరు జిల్లా జాతీయ గిరిజన ఫెడరేషన్ కమిటీ అధ్యక్షులు దేవరకొండ రాము ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని 3వ వార్డులో గిరిజన, యానాదుల నివాసాలను ఆయన సందర్శించారు. తరాలు మారుతున్న యానాదుల తలరాతలు మారడం లేదన్నారు. రేషన్, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు ఇప్పటికీ కొంతమందికి లేకపోవడం బాధాకరమని అన్నారు. నివేశన స్థలాలు లేక, పొలం గట్లపై గుడిసెలు వేసుకుని నివాసాలు ఉంటున్నారని అన్నారు. వారిని గుర్తించి, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. యానాదుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉయ్యాల శివ, ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కట్టా కామేశ్వరి, కార్యదర్శి పాలపర్తి నాగరాజు, ఉప కోశాధికారి ఉయ్యాల గురవయ్య, దాసరి లక్ష్మి పాల్గొన్నారు.




బిఎస్‌పి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జోసెఫ్

ఓటుతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని చక్రాయపాలెం ఎస్సీ కాలనీలో ఇంటింటికి బహుజన సమాజ్ పార్టీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 326ద్వార అందరికీ రాజకీయ సమానత్వం కోసం ఓటు హక్కును డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కల్పించారని బిఎస్‌పి నాయకులు జోసెఫ్ అన్నారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవడం ద్వారానే హక్కులు సాధించుకోవచ్చని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బిఎస్‌పి బలపరిచే అభ్యర్థికి ఏనుగు గుర్తుపై ఓటు వేసి అంబేద్కర్ ఆశయాలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పారి యెహెూను, అడుగు రూపేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.



వైసిపికి రాజీనామా ప్రకటించిన వేమూరి మురళీకృష్ణ

వైసిపీ నాయకుల రాజీనామా

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని నాలుగు గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు ఆదివారం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వైసిపి రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి వేమూరి మురళీకృష్ణ మాట్లాడుతూ తాము కష్టపడి పనిచేసి గత ఎన్నికల్లో వైసిపిని అధికారానికి తీసుకొస్తే గెలుపొందాకా తమను విస్మరించారని ఆరోపించారు. వైసిపికి ఓటు కూడా వెయ్యని వ్యక్తులను అందలం ఎక్కిస్తే తాము ఎందుకు పని చెయ్యాలని ప్రశ్నించారు. వేమూరు, వరాహపురం, బలిజెపల్లి, అబ్బానగూడవల్లి గ్రామాలకు చెందిన అనేక మంది వైసిపీ నాయకులు తమ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తాను పదేళ్ళుగా రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఉన్నానని, వైసిపి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి సూన్యమని అన్నారు. అభివృద్ధి ఎక్కడ ఉంటే అక్కడే పని చెయ్యాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తాము మరో రెండు, మూడు రోజుల్లో తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు.

సృజన సాహితీ ఆధ్వర్యంలో సన్మానం

ప్రజాశక్తి అద్దంకి

సృజన సాహిత్య సమావేశం చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదనంలో గాదేపల్లి దివాకర దత్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కె అనిల కుమారసూరి అతిధులను ఆహ్వానించారు. సభలో ఆర్వి రాఘవరావు, ఇలపావులూరి శేషతల్పశాయి, పాలపర్తి జ్యోతిష్మతి స్వీయకథా పఠనం చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు. డాక్టర్ బీరం సుందరరావు లబ్ధ ప్రతిష్టులని, వారి కవితలు సమాజహితాన్ని కోరే రచనలని దివాకరదత్ అన్నారు. నవ్యకవుల అభివ్యక్తి అద్భుతంగా ఉంటుందని అన్నారు. పదబంధాలు, ఆలోచనా విధానం కొత్తదనానని తెచ్చిందని డాక్టర్ బీరం సుందరరావు పేర్కొన్నారు. రిటైర్డ్ డిఎస్‌పి బీరం నాగేశ్వరరావు సభలో పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసిన రావూరి రంగయ్య తెలుగు భాషాభివృద్ధి కోసం నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. డాక్టర్



ప్రముఖ కవి బీరం సుందరరావును సత్కరిస్తున్న ప్రతినిధులు

యు దేవపాలన, రుద్రయ్య, రోటరీ బాధ్యులు మలాది శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, లేవిప్రసాద్, నర్రా శ్రీలక్ష్మి అభినందించారు. సృజన సన్మాన పత్రం, దుశ్శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. నిమ్మరాజు నాగేశ్వరరావు, పసుమర్తి కోటయ్య, లక్కరాజు శ్రీనివాసరావు, డివిఎం సత్యనారాయణ, షేక్ మస్తాన్, పూర్ణచంద్రరావు, పాటిబండ్ల శ్రీమన్నారాయణ, అనంతు నాగేశ్వరరావు, షేక్ మహమ్మద్ రఫి పాల్గొన్నారు.

రాజమండ్రిలో తెలుగు మహాసభలు

ప్రజాశక్తి - అద్దంకి

తెలుగు భాషా వైభవాన్ని చాటి చెప్పే ప్రపంచ తెలుగు మహాసభలు జనవరి 5, 6, 7తీదీల్లో రాజమండ్రికిలో జరుగుతున్నాయని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. స్థానిక రోటరీ కార్యాలయంలో అంతర్జాతీయ తెలుగు మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. సాహితీ మిత్ర మండలి ఆధ్వర్యంలో జరిగిన సభకు లక్కరాజు చంద్రశేఖర అధ్యక్షత వహించారు. శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఆంధ్రమేవజయతే నినాదంతో తెలుగు భాషా వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే దిశగా మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. డాక్టర్ కేశిరాజు శ్రీనివాస్, తెలుగు భాషాభిమాని చైతన్య రాజు జనవరి 5, 6, 7తేదీల్లో రాజమహేంద్రవరంలో శ్రీ రాజరాజ నరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది నీరాజనంగా మహాసభలు జరుగుతున్నాయని అన్నారు. తెలుగు భాషలోని 25



మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రోటరీ ప్రతినిధులు

ప్రక్రియలపై సదస్సులు, గ్రంథావిష్కరణలు, కళా ప్రదర్శనలు కన్నులపండుగగా జరుగుతాయని తెలిపారు. కవులకు, కళాకారులకు, సంస్థలకు పూర్ణకుంభ పురస్కార కార్యక్రమాలకు, కవి సమ్మేళనాలకు వేదికగా అలరించబోతున్నదని తెలిపారు. కార్యక్రమంలో కెవి పోలిరెడ్డి, లక్కరాజు శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, కొండకావూరి కుమార్, లక్కరాజు విశ్వమోహన్, వామరాజు వెంకటేశ్వరరావు, కుందాసుబ్బారావు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయ ప్రారంభ ఏర్పాట్లు

ప్రజాశక్తి - అద్దంకి

రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. వైసిపి ఇన్చార్జిగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన పానెం హనిమిరెడ్డి తన రాజకీయ కార్యకలాపాల నిర్వహణ కోసం నరసరావుపేట రోడ్డులో వైసీపీ నియోజకవర్గ నూతన కార్యాలయం ప్రారంభించ నున్నారు. ఇప్పటి వరకు ఆర్అండ్‌బి బంగ్లా కేంద్రంగా సాగిన ఆయన కార్యక్రమాలు జనవరి ఒకటి నుండి సొంత కార్యాలయం నుండి జరుగుతాయని ఆయన వ్యక్తి గత సిబ్బంది చెబుతున్నారు. కార్యాలయం ప్రారంభంతో బాటు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భవాని సెంటర్, పార్టీ కార్యాలయం



వేగంగా జరుగుతున్న వైసిపి కార్యాలయ పనులు

వద్ద భారీ హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తున్నారు. అద్దంకి ప్రారంభం నుండి నార్కెట్పల్లి హైవేపై కార్యాలయం వరకు హనిమిరెడ్డి ఫొటోతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అన్ని మండలాల నుండి 15వేలకు పైబడి అభిమానులు హాజరు అవుతున్నట్లు తెలిపారు.

పెండింగ్ బకాయిలు వెంటనే ఇవ్వాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఆర్‌సి, కరువు భత్యం బకాయిలను వెంటనే మంజూరు చేయాలని ఎపిటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాదరావు డిమాండ్ చేశారు. స్థానిక కమిషనర్ అసోసియేషన్ భవనంలో ఆదివారం జరిగిన ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల వ్యవస్థను చిన్నభిన్నం చేసిందన్నారు. రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ భాషా మాట్లాడుతూ జీవో నెంబర్.117ను రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలాని మాట్లాడుతూ నాలుగున్నరేళ్ళుగా ఒక్క ఉపాధ్యాయ పోస్టు నియామకం చేయక పోవడం దారుణమన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్న 25వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పిడి సోషలిజం



సమావేశంలో ఎపిటిఎఫ్ నాయకులు పాండురంగప్రసాద్

మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి సిపిఎస్ రద్దు చేస్తానన్న జగన్ హామీని నిలుపుకోలేకపోవడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షులు వై నేతాంజనేయ ప్రసాద్, ఐ విజయ్ సారథి, ఎంసిహెచ్ రాజరత్నం పాల్గొన్నారు.

నూతనోత్సాహంతో సాగాలి

ప్రజాశక్తి - అద్దంకి



ఎంఎల్ఎ గొట్టిపాటి రవి

ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో అంతా మంచే జరగాలని కోరారు. రాష్ట్ర ప్రజలకు నూతనోత్సాహం, నూతనోత్తేజం, నూతన ఆలోచనలతో జన కంఠక పాలనకు స్వస్తి పలికేందుకు మహిళలు, యువత నడుం బిగించి ముందుకు కదలాలని కోరారు. గాడితప్పిన రాష్ట్ర పరిపాలను గాడిలో పెట్టేందుకు మళ్లీ చంద్రబాబు సిఎం కావాలని కోరారు. అభివృద్ధి - సంక్షేమం రెండు కళ్ళుగా భావించి నిత్యం పరితపించే నిత్య శ్రామికుడు చంద్రబాబుకు తోడుగా నిలవాలని కోరారు. 2024లో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యం, మంచి పంటలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.



వైద్యశిభిరంలో ప్రాణహిత మల్టీస్పెషాలి హాస్పిటల్ వైద్యులు

దగ్గుబాడులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని దగ్గుబాడు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. కేశరాల క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ గడ్డం ధర్మానందరావు, గడ్డం నారాయణరావు జ్ఞాపకార్థం చీరాల చర్చి కాంపౌండ్ వద్ద ఉన్న ప్రాణహిత మల్టీ స్పెషాలిటీ మరియు క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. షుగర్, బిపి, ఈసిజి తదితర పరీక్షలు నిర్వహించి 250మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ గడ్డం పృథ్వీ, డాక్టర్ శివాని రోగులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు ముల్లా నూర్ అహ్మద్, గంట విజయ్ కుమార్ సహకారంతో ఏర్పాట్లు చేశారు.

చెట్లను సంరక్షించాలి

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మొక్కల పరిరక్షణ సంవత్సరం నినాదంతో ముందుకు సాగుదామని విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వృక్షాకారంలో నిల్చుని నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. చెట్లను సంరక్షించాల్సిన అవసరాన్ని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డి కోరారు. మొక్కలు నాటి, వాటి పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని కోరారు. విద్యార్థి దశనుండే పొదుపు అలవాటు చేసుకోవడం మంచిదని అన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు చైతన్యం కలిగించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల నేషనల్ గ్రీన్ కోర్ విద్యార్థులు, నేషనల్ క్యాడెట్ కోర్ విద్యార్థులు, స్టూడెంట్ పోలీస్ కాడేట్ విద్యార్థులు, పర్వతనేని పావని, భవనం శివలీల, బండారు అనిల్ కుమార్, పెంట్యాల పావని, వసంత రఘు బాబు, సిహెచ్ శ్రీవిద్య, లక్ష్మి,పెండ్యాల రాధిక, వరికల్లు బ్రహ్మయ్య, అంబటి అపర్ణ, కంభాలపాటి నరసయ్య పాల్గొన్నారు.



చెట్టులా కూర్చున్న విద్యార్థులు

2న కేంద్ర మంత్రి రాక

ప్రజాశక్తి - నిజాంపట్నం

జనవరి 2న కేంద్ర మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాల హార్బర్కు వస్తున్నట్లు మత్స్య శాఖ అభివృద్ధి అధికారి సాయి సందీప్ తెలిపారు. సాగర్ పరిశ్రమ కార్యక్రమం అమలు తీరుపై అవగాహన కల్పించేందుకు వస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి మత్స్యకారులకు వివరించనున్నారు.

వైసిపికి ప్రజలే బుద్ధి చెబుతారు

• చంద్రన్న ప్రభుత్వంలో పేదలందరికీ పక్కా ఇళ్ళు • టిడిప బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి • పర్చూరు అంబేద్కర్ నగర్ కు చెందిన 23కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పర్చూరు

టిడిపి, చంద్రబాబు పాలనలో అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్ళు నిర్మించి ఇస్తామని బాపట్ల పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన 23కుటుంబాలు గద్దె మోజేష్ ఆధ్వర్యంలో ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే ఏలూరి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా కృషి చేస్తానని అన్నారు. పేదల సొంతింటి కలను నిజం చేస్తామని అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా చంద్రబాబు ఆదర్శవంతమైన పాలన చేశారని అన్నారు. వైసిపి పాలనలో అభివృద్ధి అటకెక్కిందన్నారు. నిబంధనల


ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిన అంబేద్కర్‌నగర్ వాసులు

పేరుతో అర్హులైన అనేక మంది అర్హులకు ప్రభుత్వ పథకాలు దూరం చేశారని అన్నారు. తాము అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపుకు కృషి చేయాలని కోరారు.

వైసిపి నుంచి 23 కుటుంబాలు చేరిక

స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన చక్రవర్తి, జి ప్రేమయ్య, ఠాగూర్, సన్నీ, కళ్యాణ్, సాంద్ర సురేష్, సంజయ్, సందీప్, సుజన్, జ్ఞానయ్య, సంద్ర మరియదాసు, గద్దె మనోహర్, సాండ్రా అశోక్, సతీష్ కుమార్, రాజేష్, పి నరసయ్య, సంతోష్, బన్నీ, వెంకట్ టిడిపిలో చేరారు. కాలనీ వాసులు మాట్లాడుతూ వైసిపి పాలనలో ఎస్‌సిలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. ఎస్‌సి సంక్షేమ పథకాలు రద్దు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు షేక్ శంషుద్దీన్, సీనియర్ నాయకులు తంగేళ్ల మల్లికార్జునరావు, మక్కెన శేఖర్ బాబు, రాంబాబు, మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి రియాజ్ భాషా, టి శివా, షేక్ బషీర్ పాల్గొన్నారు.

మళ్లీ బిజెపి వస్తే భవిష్యత్ అగమ్యగోచరం

ప్రజాశక్తి - పర్చూరు

కేంద్రంలో బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే ఏపీ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారే ప్రమాదం ఉందని కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక కమ్యూనిటీ హాల్లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎపికి ప్రత్యేక హెూదా తీసుకురావడంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు విఫలం అయ్యాయని అన్నారు. కేంద్రం ప్రభుత్వంతో పోరాడి విభజన చట్టంలోని అంశాలను సాధించడంలో గత ప్రభుత్వాలు చిత్తశుద్ధి చూప లేదన్నారు. మార్పు రావాలి, కాంగ్రెస్ కావాలనే నినాదంతో వచ్చే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ ప్రజలకు చేరువయ్యేలా దృష్టి


కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాజీ కేంద్రమంత్రి శీలం

సారించమని అన్నారు. పోలవరం ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. కాంగ్రెస్‌ను వీడిన వాళ్లంతా తిరిగి రావాలని ఆహ్వానించారు. టిడిపి, వైసిపి, జనసేన నాయకులు అందరూ మోడీ శిష్యులేనని అన్నారు. రాముడిని అడ్డుపెట్టుకొని ప్రధాని మోడీ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో మోడీ చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట శివనాగేశ్వరరావు, పిసిసి ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాష్, వేమూరు ఇంచార్జి వెంకటేశ్వరరావు, పర్చూరు ఇంచార్జ్ జానకి రామయ్య, పులిపాటి రవి, కంభం మార్క్, పోతిన సంపత్ పాల్గొన్నారు.

తుపాన్ ప్రభావంతో తగ్గిన పండుగ ఉత్సాహం

ప్రజాశక్తి - పంగులూరు

కొత్త సంవత్సరం అనగానే అందరిలోనూ ఆనందం కనిపిస్తుంది. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ స్వీట్లు పంచుకోవడం, స్నేహితులతో ఆత్మీయ పలకరింపులు, ఇళ్ళ ముందు సంక్రాంతి పండుగ నెల మొదలైనట్లు మహిళల ముగ్గులు ఇలా ఒకటేమిటి. అంతా ఆనందమే కనిపించేది. అయితే ఈ సంవత్సరం మండలంలో అలాంటి ఉత్సాహం ఎక్కడా కనిపించలేదు. రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు, మధ్యతరగతి ప్రజల్లో కూడా నూతన సంవత్సరం ఉత్సాహం కనిపించడం లేదు. ఎవరిలోనూ నూతన హడావుడి లేదు. మించౌంగ్ తుఫాను కారణంగా పంటలు మొత్తం దెబ్బతిన్నాయి. మిర్చి, శనగ, మినుము, వరి, మొక్కజొన్న పంటలపై తుఫాను ప్రభావం బాగా పడింది. పంటలు దెబ్బతిని రైతాంగం దిగాలు పడుతున్నారు. శనగ పంట దెబ్బతింది. నూతన సంవత్సర వేడుకల్లో ఖర్చుపెట్టేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఆ ఖర్చేదో మళ్లీ పొలంపై పెడితే బాగుండని ఆలోచన చేస్తున్నారు. రైతుల వద్ద నగదు చలామణి తగ్గడంతో కూలీలకు రోజు గడవడం కష్టమైంది. మరోవైపు


పర్చూరులో స్వీట్లు విక్రయిస్తున్న శ్రీనివాసరెడ్డి

ఉద్యోగులకు ప్రభుత్వ విధానం కారణంగా ఒకటోతేదీ జీతం వస్తుందన్న నమ్మకం లేదు. అంగన్‌వాడీలు, మున్సిపల్, పంచాయితీ కార్మికులు, సర్వశిక్ష అభియాన్ ఇలా వరుసగా నిరవధిక సమ్మెలతో జనం మూడ్ మారిపోయింది. ఇసుక కొరతతో నిర్మాణ పనులూ తగ్గిపోయాయి. నిర్మాణ కార్మికులైన బేలుదారీ, ఇతర నిర్మాణ పనుల్లో ఉండేవారివద్ద ఆర్థిక ఇబ్బందులు తాండవిస్తున్నాయి. రైతులు, వ్యవసాయ కూలీల వద్ద డబ్బు ఉంటే సందుగకు ఏదో ఒకటి కొనుగోలు చేసేవాళ్లని వ్యాపారులు ఇచెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే వ్యాపారాలు కూడా తగ్గాయని చెబుతున్నారు. పుష్కలంగా పనులు ఉంటే నూతన సంవత్సరానికి కొత్త బట్టలు, పిండి వంటల హడావుడి ఉండేదని అంటున్నారు. కొత్త ఆశలతో కేరితలు కొట్టాల్సిన యువత ఉపాధి లేక నిరుత్సాహంగా ఉండటం పండుగ కళ తప్పినట్లయింది.

పర్చూరు : నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఐదు మిఠాయి షాపులు ఏర్పాటు చేశారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వీట్ హెూమ్ యజమాని సమ్మెట శ్రీనివాసరెడ్డి ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈ సంవత్సరం 60రకాల స్వీట్లు చేశామని తెలిపారు. ఇటీవల వచ్చిన తుఫాన్ కారణంగా కొనుగోళ్లు తగ్గాయని అన్నారు. గత వ్యాపారం మామూలుగానే ఉందని చెప్పారు. గత సంవత్సరంతో పోలిస్తే అమ్మకాలు తక్కువగానే ఉన్నాయని అన్నారు. పిస్తా, కళాకాని, బెంగాలీ స్వీట్లు, గులాబ్ జామ్, డ్రై ఫ్రూట్ హల్వా ప్రత్యేకంగా చేశామని చెప్పారు. బెంగాల్ పాన్, ఆగ్రాపా, ఐస్ క్రీమ్, కేకు, పిస్తా రోల్ స్పెషల్‌గా చేశామని తెలిపారు. స్వీట్ల రకాన్ని బట్టి కేజీ రూ.365నుంచి రూ.600, రూ.300రేట్లు ఉన్నాయని తెలిపారు.

చంద్రబాబు సిఎం అయితేనే 'భవిష్యత్తు'


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వేగేశన నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

చంద్రబాబు అధికారానికి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని టిడిపి ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. ఇంటింటికి టిడిపి, మీ మాటే – నా బాట, భవిష్యత్ కు గ్యారంటీ కార్యక్రమం మండలంలోని ముత్తయిపాలెం, చింతావారిపాలెంలో ఆదివారం నిర్వహించారు. మహిళలకు చీర, సంచి అందజేశారు. భవిష్యత్ కు గ్యారంటీ పత్రాల్లో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారు. తనను ఆదరించాలని కోరారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపుతానని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చీరాల : పట్టణంలోని 24వ వార్డు టిడిపి కార్యవర్గాన్ని టిడిపి ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య పర్యవేక్షణలో ఎంపిక చేశారు. అధ్యక్షులుగా వావిలపల్లి రమేష్, ఉపాధ్యక్షుడు కల్లేపల్లి రమణారావు, ప్రధాన కార్యదర్శి పోలకి రమణతోపాటు కార్యవర్గాన్ని నియమించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి ఐక్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో యువనాయకులు ఎం అమర్నాథ్, పట్టణ అధ్యక్షులు గజబలి శ్రీనివాసరావు, డేటా నాగేశ్వరావు, లావేటి శ్రీనివాస్ తేజ, ఉసురుపాటి సురేష్, గంజి పురుషోత్తం, కర్పూరపు సుబ్బలక్ష్మి, కొండ్రు రత్నబాబు, పైలా శ్రీనివాసరావు, గంగవరపు వెంకన్న, పులిపాటి శేఖర్ పాల్గొన్నారు.


టిడిపి కార్యకర్తల సమావేశంలో ఎంఎం కొండయ్య


సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

పట్టణం, మండలంలో ఇళ్లలో సోదాలు నిర్వహించగా మూడు డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసుల్లో ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తి నిందితులుగా ఉన్నారని ఎస్ఇబి సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. ఈ మూడు కేసుల్లో రెండు పట్టణంలోని మూర్తిరక్షణనగర్‌లో, ఒక కేసు కంకటపాలెంలో నమోదు చేసినట్లు తెలిపారు. మూడు కేసుల్లో 37క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని అన్నారు.


చేనేతల సమావేశంలో ఎంఎల్ఎ బలరామకృష్ణమూర్తి

నేతన్న నేస్తంతో చేనేతకు జీవం

ప్రజాశక్తి - చీరాల

మండలం దేవాంగపురి పంచాయతీ పరిధిలోని అయోధ్య నగర్ గ్రామంలో ది శుభోదయం చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి మరియు విక్రయ సంఘం నూతన భవనము ప్రారంభోత్సవ సభలో శాసనసభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి మాట్లాడారు. చేనేత అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నేతన్న నేస్తం పథకం ఎంతో మేలు చేసిందని అన్నారు. దీనివల్ల చేనేత వృత్తిపై కార్మికుల్లో ఆసక్తి పెరిగిందని అన్నారు. చేనేత అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, మాచర్ల మోహన్ రావు, మేడా వెంకట్రావు, బండారుపల్లి హేమంత్ కుమార్, దేవన వీరనాగేశ్వరరావు, సజ్జ శ్రీనివాసరావు, కొలుకుల కుమార్, భూసం పుణ్యవతి, బాలసుబ్రమణ్యం, తిరు వీధుల సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తల కుటుంబాలను పరామర్శిస్తున్న ఆనందబాబు

ఆనందబాబు విస్తృత పర్యటన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నియోజకవర్గంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆదివారం విస్తృతంగా పర్యటన చేశారు. జంపని గ్రామానికి చెందిన టిడిపి నాయకురాలు మన్నే లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కొల్లూరు మండలం అనంతరంలో టిడిపి సీనియర్ నాయకులు చిట్టినేని బాలగంగాధర్ తిలక్, అలపర్తి రాజారావు సన్మరణ సభలో పాల్గొన్నారు. అదే గ్రామానికి చెందిన బలిజేపల్లి చలమయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు. బాపట్ల పార్లమెంటరీ టిడిపి ప్రచార కమిటీ చైర్మన్ నాగళ్ల శ్రీధర్ దుర్గమ్మ మృతి చెందగా ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఐఆర్ఎస్‌గా సిల్వన్‌రాజుకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-ఒంగోలు

చీరాల జోన్ ఇన్‌కం టాక్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్న కురుకుంట్ల సిల్వన్ రాజుకు ఐఆర్ఎస్‌గా ఉద్యోగోన్నతి లభించింది. టంగుటూరుకు చెందిన సిల్వన్ రాజు ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించారు. నెల్లూరులో ఎల్‌డిసిగా ఉద్యోగ ప్రయాణం ప్రారంభించారు. అక్కడి నుంచి అంచెలంచెలుగా ఎదిగి.. ప్రస్తుతం అత్యున్నత స్థానం ఐఆర్ఎస్ అధికారిగా ఉద్యోగోన్నతి పొందారు. ఈయన భార్య స్నేహలత వ్యాపార రంగంలో రాణిస్తున్నారు. కుమారుడు సువర్ణరాజు ఎంఎస్ జనరల్ సర్జన్‌గా వైద్య సేవలందిస్తున్నారు. కుమార్తె డాక్టర్ మౌనిక ఎంఎస్ ఆర్థో పెడిక్‌గా ఒంగోలు జిజిహెచ్‌లో వైద్య సేవలందిస్తున్నారు. సిల్వన్‌రాజ్ సేవా కార్యక్రమాల్లోనూ ముందున్నారు. ఆశాలత ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు గత 15 సంవత్సరాలుగా నోటు పుస్తకాలు అందజేస్తున్నారు. కరోనా కాలంలో పేద కుటుంబాలకు, పారిశుధ్య కార్మికులకు మూడు నెలల పాటు నిత్యావసరాలు అందజేశారు. ప్రతి ఏడాదీ పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నారు. ఐఆర్ఎస్‌గా ఉద్యోగోన్నతి పొందిన సిల్వన్‌రాజుకు పలువురు ఐటి అధికారులు, కొండపి నియోజకవర్గ ప్రముఖులు అభినందనలు తెలిపారు.



సిల్వన్‌రాజు

హామీలు అమలు చేయకపోవడం దారుణం

- రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి
- ఎపి రజక వృత్తిదారుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తానని, చెరువులపై హక్కులను రజకులకే కల్పిస్తానని హామీ ఇచ్చారని, 50 సంవత్సరాలు వయసు నిండిన రజకులందరికీ వద్ధాప్య పెన్షన్ మంజూరు చేస్తానని హామీలిచ్చి అమలు చేయకపోవటం దారుణమని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య పేర్కొన్నారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఆదివారం రజక వృత్తిదారుల సంఘం ప్రాంతీయ రాష్ట్ర సదస్సు టంగుటూరి రాము అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎం.భాస్కరయ్య మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు పూర్తయినా.. సామాజిక సేవ వత్తి చేస్తున్న రజకులపై పెత్తందారులు, పెత్తందారీ ప్రజాప్రతినిధుల అనుచరులు దాడులు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. రజకులపై అక్రమంగా కేసులు పెడుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రజక మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇలాంటి కేసులకు వ్యతిరేకంగా రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, గత నాలుగున్నర సంవత్సరాల నుండి అధికారంలో ఉన్న వైసిపి పాలకవర్గ మంత్రులు, బిసి అభివద్ధి కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు, బిసి అభివృద్ధి సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల దష్టికి తీసుకువెళ్లినా ఎలా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గడచిన నాలుగున్నర సంవత్సరాలు కాలంలో ప్రభుత్వం రజకులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి.. వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడం దురదృష్టకరమన్నారు. పలు జిల్లాలలో రజక వత్తి చెరువులు, కుంటలు, కమ్యూనిటీ హాలు స్థలాలను పెత్తందారులు వ్యక్తిగత అవసరాలకు ఆక్రమించుకున్నారని, అడ్డువచ్చిన రజకులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తున్న సంఘటనలు ఉన్నాయన్నారు. పట్టణ ప్రాంతాల్లో దోబీఘాట్లు లేక రజక వత్తి నిర్వహణకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నా నాలుగున్నర ఏళ్లుగా వాటి నిర్మాణానికి, మరమ్మతులకు ఎలాంటి నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం, బిసి అభివద్ధి కార్పొరేషన్ వ్యవహరిస్తోందన్నారు. రజకుల సమస్యల పరిష్కారం, సామాజిక రక్షణ చట్టం సాధనకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలో రజకులతో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ జిల్లాలలో ప్రాంతీయ సదస్సులు నిర్వహించి ఈ నెల 29న రాష్ట్ర సదస్సు పెద్ద ఎత్తున జరపాలని నిర్ణయించామన్నారు. సదస్సులో శ్రీ సాయిరాం జూనియర్ కాలేజీ, సాయి వికాస్ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ కె.మోహన్‌రావు మాట్లాడుతూ రజకులందరూ ఐక్యంగా చైతన్యవంతులై రాజ్యాధికారంలో భాగస్వామ్యులు అయినప్పుడు వారి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సదస్సులో చేతివత్తుదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ తోట తిరుపతిరావు మాట్లాడుతూ చేతివత్తిదారులందరూ సమన్వయంతో, ఐక్యంగా సమిష్టి పోరాటం చేయాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల మాలకొండయ్య మాట్లాడుతూ ప్రాంతీయ సదస్సుతో జిల్లాలో రజక వత్తిదారులు, కార్మికులు, ఉద్యోగులందరినీ సమైక్యంగా చైతన్య పరచడం ద్వారా భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. అనంతరం 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సదస్సులో జిల్లా నలుమూలల నుండి వత్తిదారులు, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అయ్యపరెడ్డి

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఎస్.డబ్ల్యు.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అయ్యపరెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ కనిగిరి డిపోలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యపరెడ్డి ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయ్యపరెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా రెగ్యులర్ ఉద్యోగులు మాదిరిగానే సంస్థ అభివద్ధికి పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వారిని కూడా రెగ్యులర్ చేయాలన్నారు. కార్మికుల కోసం లేబర్ డిపార్ట్మెంట్ ఇచ్చిన హాలిడేస్‌ను అమలు చేయాలని చెప్పారు. సర్క్యులర్ ప్రకారం ప్రతి నెల 10వ తేదీ లోపల జీతాలు చెల్లించాలని సిఐటియు నాయకులు తులసి రామ్ అన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి పిఎస్.రావుతో పాటు స్థానిక ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు పాల్గొన్నారు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రజాశక్తి నూ తన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకా యమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాశక్తి క్యాలెండర్ సృజనాత్మకత దృశ్యాలతో అందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తప్పెట బాబూరావు, గోపురపు చంద్ర పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బూచేపల్లి

‘అభినవ్ భారత్’ యాప్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు నగరంలోని అస్టోనా ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి పొలిటికల్ యాప్ ‘అభినవ్ భారత్’ను ఒంగోలు మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్ ప్రారంభించారు. కార్యక్రమంలో అభినవ్ భారత్ సిఇఒ భాను ప్రతాప్, మేనేజింగ్ డైరెక్టర్ నాగిశెట్టి బ్రహ్మయ్య పాల్గొన్నారు.



‘అభినవ్ భారత్’ యాప్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం